క్లుప్తంగా

విద్యాప్రమాణాలు పెంచాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విద్యాప్రమాణాలు పెంచి విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ట్యాబ్‌ల ద్వారా, డిజిటల్ బోర్డుల ద్వారా బోధనను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నీలంవెంకటేశ్వర్లు, మస్తాన్, మహబూబ్ బాషా, చంద్రశేఖర్‌శర్మ, వెంకటరాముడు పాల్గొన్నారు.

తెలకపల్లి ఆశయ సాధనకు కృషి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): తెలకపల్లి నరసింహయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుల్లా నరసింహులు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సమసమాజం స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. సీనియర్ న్యాయవాది శంకరయ్య, మస్తాన్‌వలి, నాగరాజు, తోటమద్దులు, గౌస్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం సాగిస్తామని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిరుగు పాటి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నంద్యాలకు వ్యవసాయ రంగంలో దేశంలోనే మంచి గుర్తింపు ఉందని, రైతులు పండించే సోనా మసూరి వరికి దేశంలోనే పేరు పెట్టిందన్నారు.నంద్యాల పరిసర ప్రాంతం సీడ్‌హబ్‌గా రాష్ట్రానికే తలమానికంగా నిలిచిందన్నారు. నాయకులు అభిరుచి మధు, తాడి రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సురేంద్రారెడ్డి, శివారెడ్డి, స్వాతి, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారని, ఉచితంగా మందులు అందజేస్తారని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవో 106/2 రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): లారీ, క్లీనర్లు, డ్రైవర్లపై తెచ్చిన జీఓ నంబర్ 106/2ను రద్దు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నంద్యాలలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే జీఓను రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే డ్రైవర్లు, క్లీనర్లు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని, ఈ చట్టంతో వారి జీవితం మరింత దిగజారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మోసపూరితమైన నల్లచట్టాలను వెనక్కి తీసు కోవాలని,లేని పక్షంలో ఆందోళన కార్యక్రమా లు చేపడుతామన్నారు.కుళాయిస్వామి,రాజేష్, షరీఫ్, మున్నా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నివాళి

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట గ్రామ పంచాయతీ మజరా అయిన డి.కొత్తపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు పి.లక్ష్మీనరసమ్మ (65) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఆమె కుమారుడు పి.చంటిని ఆయన పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, ఎంపీటీసీ పి.నారాయణ, సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, రవి పాల్గొన్నారు.

నేడు బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు

నంద్యాల(అర్బన్): ఆడుదాం ఆంధ్ర బ్యాడ్మింటన్ క్రీడల్లో శుక్రవారం పెద్దకొట్టాల–భీమవరం జట్లు తలపడనున్నాయని పోలూరు హైస్కూల్ పీఈటీ గోపీకృష్ణ తెలిపారు. పాఠశాల ఆవరణలో వాతావరణం అనుకూలించకపోవడంతో సెమీ ఫైనల్ పోటీలను నంది అకాడమీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించామన్నారు. గురువారం నిర్వహించిన సెమీ ఫైనల్ పోటీల్లో రాయమాల్పురం–కొత్తపల్లి, భీమవరం–పెద్దకొట్టాల జట్లు తలపడ్డాయని చెప్పారు. శుక్రవారం నిర్వహించే ఫైనల్ పోటీల్లో పెద్దకొట్టాల–భీమవరం జట్లు తలపడతాయని వివరించారు.



ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మించిన 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆర్.పాంపల్లె సమీపంలో కుందరవాగుపై నిర్మించిన హై లెవెల్ వంతెన

ప్రారంభానికి ముస్తాబు

- ఉయ్యాలవాడలో రూ.1.85 కోట్లతో 24 గంటల పీహెచ్‌సీ నిర్మాణం
- కుందరవాగుపై రూ.5 కోట్లతో హై లెవల్ వంతెన పనులు పూర్తి
- ఆలమూరులో రూ.1.80 కోట్లతో పీహెచ్‌సీ భవనం సిద్ధం
- నేడు ప్రారంభించనున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే బిజేంద్ర, గంగుల ప్రభాకర్ రెడ్డి



ఆలమూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన పీహెచ్‌సీ భవనం

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో రూ.1.85 కోట్లతో నిర్మించిన 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన సముదాయం, ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందరవాగుపై రూ.5 కోట్లతో నిర్మించిన హై లెవెల్ వంతెన ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. శుక్రవారం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అన్ని హంగులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నూతనంగా నిర్మించింది. అలాగే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందరవాగుపై నూతన హై లెవెల్ వంతెన పనులు పూర్తి చేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి గురువారం కోరారు.

ఆలమూరులో..

రుద్రవరం: మండలంలోని ఆలమూరులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం తెలిపారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరి ఓ వైపు నుంచి కూలి పోతుండటంతో ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి దాదాపు రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో రోగులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ నూతన భవనం నిర్మించారు. పనులు పూర్తవడంతో ఎమ్మెల్యే ప్రారంభించి వినియోగంలోకి తీసుకు రానున్నట్లు వైద్య సిబ్బంది చెప్పారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



ఉయ్యాలవాడలో లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, ఎంపీ పోచా

ఉయ్యాలవాడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, సర్పంచ్ మేకల ఓబులేసు, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, గ్రామ నాయకులు ఖాతా దస్తగిరిరెడ్డి, ముసాని శివానందరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి బుక్‌లెట్ అందించి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చామని ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని గ్రామస్తులను కోరారు. దీంతో స్థానికులు కాలనీలల్లో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించగా వెంటనే పరిష్కరించాలని అక్కడేనున్న ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రవి కుమార్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్ణారెడ్డి, జేఏసీ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పోచా వెంకటరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, కసాని రవీంద్రనాథ్ రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు గురుప్రసాద్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, చెన్నూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు ఎర్రి శ్రీనివాసరెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, శింగం వెంకటేశ్వరరెడ్డి, అంబటి ఈశ్వరయ్య, కప్పురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞాన సూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో వసూలు అయ్యేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ ప్రగతికి కృషి చేయాలి



ఎన్నికైన నూతన జిల్లా కార్యవర్గం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల శ్రేయస్సే ఉపాధ్యాయ లక్ష్యమని, విద్యారంగ ప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఏపీఎన్‌జీఓ హోంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం సంస్థ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కన్నయ్య, ఉపాధ్యక్షుడిగా రబ్బానీ, ప్రధాన కార్యదర్శిగా హుసేన్‌మియా, కోశాధికారిగా విశ్వనాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లింగమయ్య, దామోదర్‌లతో పాటు 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే భాషోపాధ్యాయ సంస్థ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వీరబ్రహ్మం, షరీఫ్, శివయ్య, భాస్కరరెడ్డి, శిరివెళ్ల ఎంఈఓ డీటీ శంకర్‌ప్రసాద్, మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య, అన్నెం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'పై అవగాహన'

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట గ్రామ సచివాలయ కార్యాలయం ఆవరణలో గురువారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు సర్పంచ్ బాలీశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నోడల్ అధికారి సాయిబాబా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఓ రంగనేతాజీ, ఎంపీటీసీ శంకరీబాయి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ మురళీ, పోస్టల్ భాస్కర్ పాల్గొన్నారు.



డి.వనిపెంటలో మాట్లాడుతున్న సాయిబాబా

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు



రుద్రవరంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం



కబడ్డీ ఆడుతున్న యువకులు.



కబడ్డీ విజేత చాకరాజువేముల జట్టుతో ఎంపీడీఓ సుబ్బారెడ్డి

ఉయ్యాలవాడ:గ్రామీణ స్థాయిలో వివిధ రకాల క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారిని వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలో ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్ హోరా హోరీగా సాగాయి. గురువారం వాలీబాల్ పోటీ ల్లో డబ్ల్యూ గోవిందిన్నె, కబడ్డీలో చాకరాజు వేముల, ఖోఖోలో దొర్నిపాడు–1 జట్లు మండల స్థాయిలో విజయాన్ని సాధించి తాలుకా స్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులను ఎంపీడీఓ సుబ్బారెడ్డి అభినందిచారు.పీడీలు దేవేంద్ర, శ్రీధర్, సరళ, బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, వెంకటనారాయణ, మహేష్, బ్రహ్మానందరెడ్డి, వెటర్నరీ అస్టెంట్ గడ్డం రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్నాయి. గురువారం బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో నిర్వహించారు.

అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారుడు తరుణ్



గోస్పాడు: క్రీడలను ప్రోత్సహించేలా ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనసూయ పేర్కొన్నారు. మండలంలోని యాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో గురువారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. దీబగుంట్ల, పసురపాడు జట్ల మధ్య పోటీలో దీబగుంట్ల జట్టు గెలుపొందింది. నెహ్రూనగర్, ఒంటివెలగల జట్ల మధ్య జరిగిన పోటీలో ఒంటివెలగల విజయం సాధించింది. కృష్ణాపురం, సాంబవరం జట్లు తలపడగా సాంబవరం జట్టు గెలుపొందింది. సాంబవరం గ్రామానికి చెందిన క్రీడాకారుడు తరుణ్ 67 పరుగులు చేసి ప్రతిభ చాటాడు.

అడుగులన్నీ బెజవాడ వైపు



నంద్యాల నుంచి బస్సులో బయలుదేరుతున్న దృశ్యం



రుద్రవరంలో బస్సు ఎక్కేందుకు సిద్ధమైన నాయకులు

- నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
- దేశానికే తలమానికంగా విగ్రహ నిర్మాణం
- కార్యక్రమానికి భారీగా తరలి వెళ్తున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): విజయవాడ నగరంలో సామాజిక న్యాయానికి నిలువెత్తు రూపం ఆవిష్కృతమవుతుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నత రూపం నేడు ప్రజలకు దర్శనమివ్వబోతుంది. విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహం, దేశంలోని అన్ని విగ్రహాల్లో మూడవ స్థానంలో నిలవనుంది. అణగారిన వర్గాల ఆశా జ్యోతి, రాజ్యాంగ ప్రధాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలివెళ్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన బెజవాడ నడిబొడ్డున అంబేడ్కర్ కాంస్య విగ్రహం, అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు బస్సులు, రైళ్లు, ఇతర వాహనాల్లో స్వచ్ఛందంగా తరలి వెళ్తున్నారు. వీటితో పాటు అంబేడ్కర్ జీవిత విశేషాలు తెలిపే డిస్‌ప్లే, ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం కల్పించే గార్డెన్, విగ్రహం దిగువ ఏర్పాటు చేసిన లాన్, స్మృతివనం లోపల హాల్, అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, కన్వెన్షన్ సెంటర్, ఫుడ్ కోర్టులు, వాటర్ ఫౌంటెన్, యాంఫీ థియేటర్లు ప్రారంభం కానున్నాయి.

విజయవాడకు పయనం

రుద్రవరం:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రుద్రవరం మండలం నుంచి దళిత సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దళిత సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపోగు నరసింహులు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో నిర్వహించే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి స్వచ్ఛందంగా వెళ్తున్నట్లు చెప్పారు. ఏ నాయకుడు చేయలేనట్లుగా జగనన్న దళితులకు అన్ని రకాలుగా అండగా నిలవడంతో పాటు ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నారన్నారు. అనంతరం వారంతా బస్సు ఎక్కగానే ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మదార్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రసాద రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, హరినారాయణ, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ వీడ్కోలు పలికారు.

రాష్ట్రానికే గర్వకారణం



స్టాచివ్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఏర్పాటు అవుతుండటం రాష్ట్రానికి గర్వకారణం. ఇంత ఎత్తయిన అంబేడ్కర్ కాంస్య విగ్రహం దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా రికార్డుకెక్కనుంది. అంబేడ్కర్ ఆలోచన విధానాలకు అద్దంపట్టే అద్భుత కళా ఖండంగా తీర్చిదిద్దడం అభినందనీయం. –సుబ్బన్న, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల

విగ్రహం ఏర్పాటు హర్షణీయం



విజయవాడ స్వరాజ్ మైదానంలో దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయం. ఇచ్చిన మాటపై నిలబడే ముఖ్యమంత్రి అంబేడ్కర్ విగ్రహం నిర్మించడం చరిత్రాత్మకం. సాహసంతో కూడుకున్న ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం జగనన్నతోనే సాధ్యం అని మళ్లీ నిరూపించారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు భారీగా తరలి వెళ్తాం. – రాజునాయక్, జీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, నంద్యాల

సామాజిక న్యాయానికి నిలువెత్తు రూపం



సామాజిక న్యాయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు రూపం. ఆయన రూపాన్ని విజయవాడ నడిబొడ్డున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయం. విగ్రహావిష్కరణ కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుంది. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలి వెళ్తున్నాం. – రామారావు, మదర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నంద్యాల

అంబేడ్కర్ విధానాలను అమలు చేస్తున్న జగన్



అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనిచ్చి గౌరవిస్తున్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తుండటం అభినందనీయం. – వై.వేణుగోపాల్‌నాయుడు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, నంద్యాల

ముమ్మరంగా తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా గురువారం పోలీసులు ముమ్మరంగా తనికీలు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని చెక్ పోస్టుల వద్ద సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా 80 బైండోవర్ కేసులు, 16 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, ఎనిమిది ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 20 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 122 లీటర్ల సారా సీజ్ చేశామని, 9 డీపీఎల్ కేసులు నమోదు చేసి 116 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని చెప్పారు. అలాగే మూడు ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేయడంతో పాటు 79 కర్ణాటక మద్యం బాటిళ్లు, 9 తెలంగాణ మద్యం సీసాలు సీజ్ చేసి, నంద్యాల వన్ టౌన్ పరిధిలో మట్కా కేసు నమోదు చేసి రూ.3,520 స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఇదిలా ఉండగా దొర్నిపాడు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పి.తిరుపాలు నందివర్గం ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. అక్కడ బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.

ముగిసిన గ్రామాభివృద్ధి ప్రణాళిక శిక్షణ



శిక్షణ ఇస్తున్న అంకన్న

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షకుడు అంకన్న మాట్లాడుతూ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు వనరులను సేకరించి ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగం, గ్రామాలకు అవసరాలకు సంబంధించిన నివేదికలను తయారు చేసి అమలు చేసుకోవాలన్నారు. గ్రామాలకు అవసరాలను గుర్తించి ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ శంకర్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డులేదా?



అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

నంద్యాల(సిటీ): పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అడ్డు లేకుండా పోయింది. నిబంధనలు గాలికి వదిలి అక్రమ నిర్మాణాలు సాగుతున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో అక్రమాలకు అవకాశంగా మారింది. ఇటీవల శ్యామ కాల్వ పైన నిర్మించిన వంతెన ఆనుకుని నిర్మాణం చేపట్టడంపై పట్టణ ప్రణాళిక విభాగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సలీంనగర్ నుంచి దేవనగర్, హనీఫ్ నగర్ ప్రాంతాలను కనెక్ట్ చేస్తున్న బ్రిడ్జిప్రహరీపై నిర్మాణం చేపడుతున్నా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): గుంతకల్లు–గుంటూరు డివిజన్ల మధ్య జరిగే రైల్వే డబ్లింగ్ పనులను ఎస్‌డీజీఎం (సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్)/ సీవీఓ (చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్) అరవింద్ మాల్‌ఖేడే శుక్రవారం పరిశీలించనున్నారని నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ దొరస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న డోన్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చి నంద్యాల రైల్వే స్టేషన్‌ను పరిశీలించి మోటార్ ట్రాలీ ద్వారా జగ్గంబొట్ల కృష్ణాపురం వరకు ప్రయాణించి తిరిగి గిద్దలూరు నుంచి రైలు బస్సులో నంద్యాలకు చేరుకుంటారని పేర్కొన్నారు.